



ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు

ఏచూరి మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు



పలమనేరులో



బంగారుపాళ్యంలో

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: సిపిఐఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరనిలోటని సిపిఎం జిల్లా నాయకులు కాంచివరం సురేంద్రన్ అన్నారు. సీతారాం ఏచూరి చిత్రపటానికి స్థానిక గాంధీ విగ్రహం ఎదుట సిపిఎం, జర్నలిస్టుల ఫెడరేషన్, సిపిఐ, దళిత, ముస్లీం మైనార్టీ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సురేంద్రన్ మాట్లాడుతూ సిద్ధాంతం కోసం ఆశయాల కోసం కమ్యూనిస్టు వ్యవస్థ కోసం తన ఆఖరి శ్వాస వరకు పనిచేసిన మానవతావాది మేధావి, తన జీవితాంతం ప్రజాసేవకే అంకితమైన కామ్రేడ్ సీతారాం ఏచూరి ఆశయాలను ఆలోచనలను మనం ఎంతో నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

కమ్యూనిస్టు యోధుడు..

పీపుల్స్ డెమోక్రసీ పత్రిక ఎడిటర్‌గా, సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించిన సీతారాం ఏచూరి మరణం తీరని లోటు అని ఏపీ డబ్ల్యూజేఎఫ్ జిల్లా కన్వీనర్ వరదరాజులు అన్నారు. చిత్తూరు నగరం గాంధీ విగ్రహం వద్ద కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రం పటానికి జర్నలిస్టులు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్, జిల్లా కో కన్వీనర్ జయప్రకాష్, సీనియర్ జర్నలిస్టులు జయరాజ్, వీరరాఘవ నాయుడు, ఉమాశంకర్, బాలసుబ్రమణ్యం, నాగరాజు, కుబేంద్రన్, తులసిరామ్ రెడ్డి, మురళి, ధరణిధర్, రాజేంద్ర నాయుడు, కపానందరెడ్డి, కేశవులు, సత్యం ప్రసాద్, జయచంద్ర, యాదవేందర్ రెడ్డి, దినేష్ కుమార్, ప్రకాష్, సురేంద్ర రెడ్డి, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

కామ్రేడ్ సీతారాం ఏచూరి అకాల మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు అని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. శుక్రవారం చిత్తూరు మహాత్మా గాంధీ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి

- యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సరిత

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి సీతారాం ఏచూరి అని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సరిత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మండల యూటీఎఫ్ అధ్యక్షులు మొగిలయ్య ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వామపక్షాల వెలుగు రేఖ సీతారాం ఏచూరి ఐదు దశాబ్దాల పాటు ఎర్రబాటలో అగ్రగామిగా నిలిచారని విద్యార్థి దశలో ఎస్ఎఫ్ఐలో ప్రవేశించి కేంద్ర ఎస్ఎఫ్ఐ కమిటీలో సభ్యులుగా కొనసాగి సిపిఎం పార్టీకి సభ్యులుగా చేరి వివిధ పదవులు అలంకరించిన వ్యక్తిని అంచలంచెలుగా ఎదిగి సిపిఎం జాతీయ అధ్యక్షులుగా విధులు చేపడుతూ మృతి చెందారని ఆయన మృతి సిపిఎం పార్టీకి తీరనిలోటని అన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ సభ్యులు మోహన్ రెడ్డి, సోమశేఖర్ నాయుడు, చెంచునాయుడు, బాషా, రైతు సంఘ నాయకులు శంకరన్, పారిశుద్ధ్య కార్మికులు మధు, సుబ్రహ్మణ్యం, బాలాజీ, చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్, సీతారాం ఏచూరికి ఘన నివాళులు

ప్రజాశక్తి-పలమనేరు:

పట్టణ సిపిఎం పార్టీ ఆఫీస్‌లో శుక్రవారం ముందుగా సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. కొంత సమయం మౌనం పాటించారు. కామ్రేడ్ సీతారాం ఏచూరి సిపిఎం పార్టీ అఖిలభారత కార్యదర్శిగా ఉంటూ అనారోగ్య కారణాల రీత్యా చనిపోవడం జరిగింది. 50 సంవత్సరాలుగా విద్యార్థి దశ నుండి చివరి వరకు పార్టీ ఉద్యమమే ఊపిరిగా పనిచేసినటువంటి మహనీయుడు సీతారాం ఏచూరి అని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొనియాడారు. కార్యక్రమంలో గిరిధర్ గుప్తా, ఓబుల్ రాజు, భువనేశ్వరి, పలమనేరు పట్టణ శాఖ కార్యదర్శి ఈశ్వర్, ఎల్ఐసి నాయకులు మునిరాజులు తదితరులు పాల్గొన్నారు.





మృత్యు మొ(కొ)గిలి



ప్రజాశక్తి - బంగారుపాళ్యం (చిత్తూరు జిల్లా)

నిన్న గురువారం సాయంత్రం తిరుపతి జిల్లా భాకరాపేట ఘాట్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. టమోటా లోడ్‌తో వెళుతున్న కంటైనర్ మలుపు వద్ద కారుపై పడడంతో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు.. ఈ ఘటన మరువక ముందే శుక్రవారం సాయంత్రం బంగారుపాళ్యం సమీపంలోని మొగిలి ఘాట్‌లో బస్సును లారీ ఢీకొన్న ఘటనలో ఏడుగురు దుర్మరణం పాలయ్యారు. దాదాపు 33 మంది క్షతగాత్రులయ్యారు. వీరిలో తొమ్మిదిమంది పరిస్థితి విషమంగా ఉందని సమాచారం. ఘటనా స్థలాన్ని చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పి మణికంఠ చందోల్, జేసీ విద్యాధరి పరిశీలించారు. పలమనేరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. ఘటనపై సిఎం చంద్రబాబునాయుడు, రోడ్డు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియో ప్రకటించారు. పోలీసుల వివరాల మేరకు...

బంగారుపాళ్యం మండలం మొగిలి ఘాట్‌లో బెంగుళూరు నుంచి వైజాగ్ వెళుతున్న లారీ (ఎపి 15 టిబి 7777) అదుపు తప్పి డివైడర్‌ను దాటి తిరుపతి నుంచి బెంగుళూరు వెళుతున్న ఆర్టీసీ బస్సును (ఎపి 03 జడ్ 5419) ఢీకొంది. ఆ స్పీడుకు ఆర్టీసీ బస్సు వెనక్కి తిరిగి వెనక వస్తున్న లారీని (ఎపి 03టిజి 7619) ఢీకొంది. రెండు లారీల మధ్య బస్సు ఉండడంతో బస్సులోని అందరికీ గాయాలయ్యాయి. సంఘటన స్థలంలోనే ఆరుగురు అక్కడి కక్కడే మృతిచెందారు. క్షతగాత్రులను పలమనేరు ఆస్పత్రికి తరలిస్తుండగా మరో ఇద్దరు మృతిచెందారు. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియో ప్రకటించింది. గాయపడిన వారికి చిత్తూరు, బంగారుపాళ్యం, పలమనేరు, కుప్పంలలో మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు ఎస్పి తెలిపారు. సంఘటనా స్థలంలో సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. పలమనేరు, పూతలపట్టు ఎంఎల్ఎలు అమరనాథ్‌రెడ్డి, మురళీమోహన్‌లు పలమనేరు ఆస్పత్రుల్లో క్షతగాత్రులను పరామర్శించారు.

రూ.10 లక్షలు ఇవ్వాలి : సిపిఎం

రోడ్డు ప్రమాదంలో మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మొగిలి ఘాట్‌లో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించి, నష్టపరిహారం చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

మృతుల వివరాలు

1. ఆర్టీసీ డ్రైవర్ మనోహరన్ (56) తిరుపతి 2. ఎస్.విజయమ్మ (53) పాకాల మండలం కంభాలమిట్ట, 3. హన్షిక యాదవ్ (6) మహారాష్ట్రకు చెందిన మహరాజ్ గంజ్ వాస్తవ్యుడు అశుతోష్ యాదవ్ కుమార్తె 4. బాలరాజు తెలంగాణా రాష్ట్రం సిద్ధిపేట వాస్తవ్యుడు బాలయ్య కుమారుడు 5. లారీ డ్రైవర్ సోనుకుమార్ (31), ఉత్తరప్రదేశ్ రాష్ట్రం చిత్‌రంజల్ ప్రసాద్. 6. గంగాధర నెల్లూరు మండలం జంగాలపల్లికి చెందిన శంకర్‌రెడ్డి (48).

మొగిలి ఘాట్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో 7 గురు మరణించగా అందులో ఆరుగురిని గుర్తించడం జరిగింది. పై ఫొటోలో ఉన్న మరొకరి ఆచూకీ ఎవరికైనా తెలిసిన వెంటనే బంగారుపాళ్యం ఇన్స్పెక్టర్ 9440796736 కు లేదా చిత్తూరు పోలీస్ కమాండ్ అండ్ కంట్రోల్ నెంబర్ 9440900005 కు తెలుపవలసిందిగా మనవి.

క్షతగాత్రులు వీరే...

తీవ్రంగా గాయపడిన వారు ఎక్కడివారన్నది తెలియరాలేదు. శివ (36), రిక్కీ (36), చిరంజీవి , బాబు రెడ్డి, మురళి ,అస్మిత్ యాదవ్ , పద్మావతి (54), , లావణ్య (23), అమరనాథ్ (40) వీరి తలకు తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉందని సమాచారం. వీరు స్పృహలో లేని కారణంగా వీరి వివరాలు తెలియరాలేదు.

చిత్తూరుకు చెందిన మంజుల, శ్రీనివాస్, బెంగళూరుకు చెందిన సక్కుబాయి, విష్ణు, కళ్యాణ్ ,వెంకటేష్, రితిష్కి , కష్ణ , జమిందామాలతి, బేబీ జాస్మిన్, రితిక , రక్షిత, భాస్కర్ రెడ్డి, ఒరిస్సా కి చెందిన ప్రశాంత్ కుమార్ నేతాజీ ,చిరంజీవి, చెన్నైకి చెందిన శ్రీధర్ బారెడ్డిపల్లి మండలానికి చెందిన వెంకటరమణ, పలమనేరు కు చెందిన అక్రమ్ ముబారక్ గాయపడ్డారు. వీరిని పలమనేరు, చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

- ఘాట్‌లో భారీ ప్రమాదం
- ఆర్టీసీ బస్సు, లారీలు ఢీ
- 31 మందికి తీవ్ర గాయాలు
- సిఎం చంద్రబాబు దిగ్భ్రాంతి
- మృతులకు రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా

108 సిబ్బందిపై కలెక్టర్ సీరియస్

ఘటనా స్థలం నుంచి మృతదేహాలను శవపరీక్ష నిమిత్తం తరలించేందుకు 108 సిబ్బంది అంగీకరించకపోవడంతో కలెక్టర్ సీరియస్ అయ్యారు. కలెక్టర్ సిబ్బందిని మందలిస్తూ 'మీరు వాహనంలో తీసుకెళ్లకపోతే నేనే మృతదేహాలను వాహనాల్లో తరలిస్తాను' అని మండిపడడంతో సిబ్బంది మృతదేహాలను తీసుకెళ్లేందుకు అంగీకరించారు.


ప్రమాదంలో జీడీ నెల్లూరు మండల వాసి మృతి

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: పలమనేరు మొగిలి ఘాట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గంగాధర నెల్లూరు మండలం వేపంజేరి పంచాయతీలోని జంగాలపల్లికి చెందిన రిటైర్డ్ విఆర్‌ఓ రాజారెడ్డి కుమారుడు శంకర్ రెడ్డి(48) మృతి చెందారు. ఇతనికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

పాకాల రైల్వే స్టేషన్‌కు మహర్దశ..

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్:

చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు కృషి ఫలితంగా పాకాల రైల్వే స్టేషన్‌కు మహార్ధశ పట్టనుంది. పాకాల ప్రజల చిరకాల కల నెరవేరనుంది. పాకాల రైల్వే స్టేషన్ బ్రిటిష్ కాలం నుంచి ఉండటమే కాకుండా.. రెండు జిల్లాలైన చిత్తూరు, తిరుపతి ప్రాంతాలకు అనుసంధానమై ఉన్న పాకాల రైల్వే స్టేషన్ ప్రాధాన్యతను చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల గుర్తించారు. దీని కారణంగా పాకాల రైల్వే స్టేషన్ను అన్ని రకాల అభివృద్ధి చేయాలని సంకల్పించిన ప్రసాదరావు .. కొత్త రైల్వే కోచ్ డిపోకి సంబంధించిన ప్రతిపాదనలను కేంద్ర రైల్వే శాఖామంత్రికి సమర్పించి, ఆధునీకరించాలని విజ్ఞప్తి చేశారు. పాకాల రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాలలో ఎనిమిది లైన్ల రైల్వే రహదారి మార్గాలతో పాటు.. రైల్వే కొత్త కోచ్ డిపోను వచ్చే ఏడాది మార్చి నుంచి నిర్మించేందుకు సిద్ధమైంది. ఈ మేరకు సౌత్ సెంట్రల్ రైల్వే శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 9న జరిగిన సేఫ్టీ మీటింగ్లో పాకాల రైల్వే స్టేషన్‌కు సంబంధించి, రైల్వే కొత్త కోచ్ డిపో నిర్మాణానికి సూత్ర ప్రాయంగా ఆమోదం లభించింది. ఈ నేపథ్యంలోనే సౌత్ సెంట్రల్ రైల్వే శాఖ గుంతకల్ డివిజనల్ ఆఫీస్‌కు ఉత్తర్వులు జారీ అయ్యాయని, రైల్వే ఇంజనీరింగ్ అధికారులు కూడా వచ్చే ఏడాది మార్చి నుంచి పనులు చేపట్టేందుకు సిద్ధమవుతున్నట్లు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.



ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు

ప్రగతిని సాధిద్దాం: ఎమ్మెల్యే



ప్రజాశక్తి-ఐరాల: వర్గం, వర్ణం లేకుండా పని చేసి ప్రగతిని సాధించాలని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ అన్నారు. శుక్రవారం మండల ఎంపీడివో కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంకు అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఐరాల మండలంలో ఇప్పటి వరకూ 22 లేఅవుట్‌లు వేశారని, అందులో 1128స్థలాలు మంజూరు చేస్తే, అందులో కేవలం 22ఇళ్లు మాత్రమే నిర్మించారని మండిపడ్డారు. లే అవుట్‌లో 22మంది పట్టాలు అందజేశారని తెలిపారు. ఎవరైనా ఇచ్చేస్తాం.. అన్ని చేసేస్తాం అని అనడం వల్ల రూ.30కోట్లు ఖర్చు అయ్యిందన్నారు. ఇకపై ఇలా జరగకుండా నిజమైన లబ్ధిదారులకు ఇళ్ళు నిర్మించి ఇవ్వాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్న విషయం గుర్తుంచుకోవాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు.

పట్టు వస్త్రాల సమర్పణ



ప్రజాశక్తి-ఐరాల: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరస్వామి వారి దేవస్థానం తరపున శుక్రవారం పట్టువస్త్రాలు అందాయి. శ్రీకాళహస్తి ఆలయం తరపున పట్టువస్త్రాలను ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తీసుకొచ్చారు. ఈయనకు పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ ఆలయ ఈవో గురుప్రసాద్ ఆహ్వానం పలికారు. ఆలయ వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని వినాయక స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయం వద్దకు చేరుకున్న వీరికి పూర్ణకుంభ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వీరికి ఆశీర్వాద మండపంలో వేద పండితులు వేద ఆశీర్వాదం అందించగా, ఆలయ ఈవో గురుప్రసాద్ పట్టు వస్త్రంతో సత్కరించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు, చిత్ర పటాన్ని అందజేశారు.

ఎస్సీ కాలనీ స్థలం కబ్జా..

- చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా నాయకులు వెంకటరమణ డిమాండ్

ప్రజాశక్తి-పుంగనూరు: మండలంలోని వనమల దిన్ని గ్రామంలో ఎస్సీ కాలనీ స్థలాన్ని కబ్జా చేసి దౌర్జన్యం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా నాయకులు వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం పుంగనూరులో ఆయన మాట్లాడుతూ 1977లో ప్రభుత్వం ఎస్సీ కుటుంబాలకు కాలనీ స్థలాన్ని కేటాయించారన్నారు. కాలనీ ప్రజలు కొంత స్థలాన్ని భవిష్యత్తులో ప్రజాప్రయోజనాల కోసం వదులుకోగా ఆ స్థలాన్ని కొంతమంది వ్యక్తులు కబ్జా చేయడానికి నిరంతరం ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. దౌర్జన్యంగా ప్రహరీ నిర్మించడానికి ప్రయత్నాలు చేస్తే కాలనీ ప్రజలు ఇది కాలనీకి సంబంధించిన స్థలమని అడ్డుకునే ప్రయత్నం చేస్తే మహిళలపై దౌర్జన్యం చేశారన్నారు. ఈ విషయం రెవెన్యూ, పోలీసు అధికారులకు బాధితులు ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడం సరైన విధానం కాదన్నారు. రెవెన్యూ అధికారులు గతంలో రెండుసార్లు సర్వే చేసి కాలనీకి సంబంధించినది తేల్చినా ప్రయోజనం లేకుండా పోయింది అన్నారు. సర్వే చేసి స్థలం తేల్చేంతవరకు ఎలాంటి గొడవలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని, మహిళలపై దౌర్జన్యం చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు.



స్థలం వద్ద వివాదాలకు దిగిన దృశ్యం

వరద బాధితులకు రూ.10లక్షల విరాళం

ప్రజాశక్తి-గంగవరం: మండలంలోని మదర్ థెరిసా విద్యాసంస్థలు ఛైర్మన్ రవీంద్రబాబు విజయవాడ వరద బాధితులకు రూ.10లక్షల విరాళం ఇచ్చారు. శుక్రవారం అమరావతిలో మంత్రి లోకేష్ ను కలిసి చెక్కును అంద జేసినట్లు కళాశాల అకాడమీ అధికారి రాజేందర్ రెడ్డి తెలిపారు. సహాయ సహకారాలు అందించిన విద్యార్థులు, అధ్యాపకులకు అభినందనలు తెలిపారు.



మంత్రికి చెక్కును అందజేస్తున్న కళాశాల ఛైర్మన్

ఫ్లై ఓవర్ నిర్మాణానికి చర్యలు

ప్రజాశక్తి-గుడిపల్లి: మండల ప్రజలకు సౌకర్యవంతంగా ఫ్లై ఓవర్ పనులు నిర్మించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. శుక్రవారం గుడిపల్లి రైల్వే లైన్ వద్ద అక్కడి మట్టిని సేకరించారు. జియాలజికల్ ల్యాబ్‌కు పంపి పరిశీలనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు. కాగా అక్కడ మట్టి సేకరణను టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు బాబు నాయుడు పరిశీలించారు. ఫ్లై ఓవర్ అందుబాటులోకి వస్తే మండలం నుంచి కుప్పం టౌన్‌కు చేరుకోవడానికి సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు.



గూ(గో)డు..!

పేదోడికి పక్కా ఇల్లు కట్టించివ్వాలన్న గత వైసీపీ ప్రభుత్వ లక్ష్యం ఆరంభశూరత్వం అన్నచందంగా మిగిలిపోయింది. నిరుపేదలకు పక్కా గృహాలు మంజూరు చేయాలన్న సదుద్దేశంతో లేఔట్‌లు వేసి ప్లాట్లు ఇచ్చారు. అక్కడ కోటి ఆశలతో పక్కా ఇల్లు నిర్మించుకోవాలన్న పేదోడి ఆనందం అంతలోనే ఆవిరైంది. సకాలంలో బిల్లులివ్వక, కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించక, అటు నిర్మాణాలకు సామగ్రి అందుబాటులో లేక అసంపూర్తిగానే ఇళ్ల నిర్మాణం ఆగిపోయింది. దీంతో సగంలోనే మిగిలిన ఇళ్లు పూర్తి చేసుకోలేక, ప్రభుత్వ పరంగా సాయం అందక పేదల కంట కన్నీళ్లు ఉబుకుతున్నాయి. కొత్తగా ఏర్పడ్డ కూటమి ప్రభుత్వంపైనే కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు. - ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్

"ప్రతి నిరుపేదకు సొంతింటి కలను నెరవేరుస్తాం.. పెద్ద సంఖ్యలో పూర్తి స్థాయిలో ఫ్లాట్లు ఇచ్చి ఇళ్ల నిర్మాణం చేపట్టి, ఇంటి తాళాలు చేతికిస్తాం.." ఇవి గత ప్రభుత్వంలో నేతల మాటలు. ఆర్భాటంగా సామూహిక గృహ ప్రవేశాలు చేసేస్తాం.. అంటూ కాలం నెట్టుకొచ్చారు. ఇళ్ల తాళాలిస్తామంటూనే 'వచ్చే సంక్రాంతి' ఆ తరువాత 'సంక్రాంతి'కి అని వాయిదా వేస్తూ కాలం గడిపారు. అంకెల గారడి వివరిస్తూ.. కోట్లు నిధులంటూ లెక్కలు చెప్పారు. కోటి ఆశలతో ఇళ్ల నిర్మాణాలు మొదలుపెట్టిన పేదలకు సకాలంలో బిల్లులు మంజూరు చేయలేదు. అరాకొరా సదుపాయాలతో ఇళ్ల నిర్మాణానికి ఇబ్బంది పడ్డారు. లౌఔట్‌ల వద్ద కనీస సౌకర్యాలు లేక నానా అవస్థలు పడి దాచుకున్న ఆ కొంత సొమ్మును ఖర్చుచేసి బేస్మెంట్ వరకూ.. ఇంకొందరు గోడల వరకూ పనులు చేసి విడిచిపెట్టారు. ప్రభుత్వ పరంగా తోడ్పాటు లేక ఇబ్బందులు తప్పడం లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక, సిమెంటు, కమ్మి వంటివి కూడా ప్రభుత్వం అందించలేక పోయిందని ఒకింత అసహనం వ్యక్తం చేస్తున్నారు. అసంపూర్తిగా ఇళ్లు ఆగిపోవడం, అక్కడ కనీస రోడ్డు, విద్యుత్, నీటి సౌకర్యం లేకపోయాయని వాపోతున్నారు. సగంలో ఆగిన ఇళ్లను పూర్తి చేసుకోలేక సాయం అందక జగనన్న కాలనీలు చిట్టడివిని తలపిస్తున్నాయని లబ్ధిదారులు చెబుతున్నారు.



చిత్తూరు రూరల్ మండలం తుమ్మిందపాళ్యం వద్ద అసంపూర్తిగా ఇళ్లు

- కలగా మిగిలిన పేదల సొంతింటి నిర్మాణం
- మొండి గోడలతో దర్శనం ఇస్తున్న జగనన్న కాలనీలు
- చిట్టడవిని తలపిస్తున్న లేఔట్‌లు
- కొత్త ప్రభుత్వం పైనే కోటి ఆశలు

గొప్ప లక్ష్యం.. ఆచరణ లోపం

గత ప్రభుత్వం జగనన్న కాలనీల పేరుతో ఉమ్మడి జిల్లాలో 1,73,722 గృహాలు మంజురు చేసింది. 340చదరపు అడుగుల్లో గృహాల నిర్మాణం కోసం రూ.3151.30కోట్లు మంజురు చేసింది. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.1,80,000 చొప్పున అందించేందుకు నిర్ణయం తీసుకుంది. అప్పటి ప్రభుత్వం ప్రకటించిన రూ.1.80లక్షల సొమ్ము గృహనిర్మాణాలకు ఏ మాత్రం సరిపోలేదంటూ లబ్ధిదారులు చెబుతున్న మాట. ఫలితంగా జిల్లాలో 1,47,363 గృహాలు బేస్మంట్ స్థాయిలోనే ఉన్నాయి. 1,039 లేఔట్‌లో 847లేఔట్‌లకు రూ.102కోట్లు నీటి వసతి కోసం మంజురు చేసినా ఈ నిధులు పూర్తి స్థాయిలో ఖర్చు చేయలేదు. గృహ నిర్మాణాల కోసం లబ్దిదార్లు నానాపాట్లు పడాల్సి వస్తోంది. గత ప్రభుత్వంలో ఇండ్ల నిర్మాణాలకు పూనుకున్న పేదలకు ఇబ్బంది కలగకుండా బిల్లులు సకాలంలో చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించినా ఆచరణ శూన్యం కావడంతో అసంపూర్ణంగా గృహాలు ఉండిపోయాయి.

కొత్త ప్రభుత్వంపై కోటి ఆశలు

ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సొంత ఇంటి కల నెలవేర్చాలని పేదలు కోరుతున్నారు. గత ప్రభుత్వంలో ఏడు నెలలుగా గృహ నిర్మాణ లబ్దిదార్లకు బిల్లులు ఆగిపోయాయి. ఆగిన ఇళ్లు పూర్తి చేసుకోవడానికి చేయూతనివ్వాలని వేడుకుంటున్నారు. కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని మొరపెట్టుకుం టున్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాట్లు చేసిన కాలనీ ల్లో రోడ్డు నిర్మించి, నిర్మాణ సామగ్రిని అందుబాటు లోకి తీసుకురావాలని కోరుతున్నారు. ఒకొక్క ఇంటికి గత ప్రభుత్వం ప్రకటించిన రూ.1.80 లక్షలను పెంచి ఇవ్వాలని ఇండ్లు పూర్తి చేసుకోవ డానికి సహకరించాలని తాజా ప్రభుత్వ సాయం కోసం పేదలు కోటి ఆశలతో ఎదురు చూస్తున్నారు.



వి కోట మండలంలో జగనన్న కాలనీ పరిస్థితి ఇదీ

అదనంగా నిధులు కేటాయించాలి



ఐద్వ జిల్లా కార్యదర్శి భువనేశ్వరి

పేద, మధ్య తరగతికి సొంత ఇంటి కల నెరవేర్చేలా అసంపూర్తిగా ఉన్న ఇళ్లు పూర్తి చేసేందుకు నూతన ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. అదనంగా నిధులు కేటాయించాలి. గత ప్రభుత్వం కొండలు, గుట్టలు పేదల ఇండ్ల కోసం కేటాయించింది. అనేక ప్రాంతాల్లో మౌలిక వసతులు లేవు. రూ.1.80 లక్షలు ఇంటి నిర్మాణానికి ఏ మాత్రం సరిపోదు. అదనంగా రూ.50 వేలు మంజూరు చేయాలి.

ప్రభుత్వ సాయం సరిపోదు



సుశీలమ్మ, జీడి నెల్లూరు మండలం

ప్రభుత్వ ఋణం ఏమాత్రం సరిపోవడం లేదు. నాకు రాళ్ళురప్పలు ఉన్న భూమి ఒక్కటిన్న సెంటు ఇంటి స్థలం ఇచ్చారు. గృహ నిర్మాణం కోసం ప్రభుత్వం ఇచ్చిన డబ్బులతో మోల్డి ంగ్ వరకు కూడా సరిపోలేదు. అదనంగా రూ.70 నుంచి 80వేలు ఖర్చు చేస్తే తప్ప ఇంటి నిర్మాణం పూర్తి కాదు. మోల్డింగ్ వరకు నిర్మించి ఆపేశాను.

మౌలిక వసతులు కల్పించాలి



చిన్నయ్య, చిత్తూరు

చిత్తూరు నగరానికి 10కిలో మీటర్ల దూరంలో బండపల్లివద్ద ఇంటి స్థలం ఇచ్చారు. మౌలిక సదుపాయాలు కల్పించలేదు. ఇల్లు నిర్మించుకోవడం కష్టంగా ఉంది. స్థలం చదును చేసుకోవడానికే రూ.30వేలకు పైగా ఖర్చు చేశారు. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి రూ.లక్ష వచ్చాయి. గోడల వరకు నిర్మించాను. ప్రభుత్వ తరపున రుణం ఏమాత్రం సరిపోవడం లేదు. కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి.

ప్రెస్‌క్లబ్ ఎన్నికలు ఏకగ్రీవం



ప్రజాశక్తి-పూతలపట్టు: పూతలపట్టు మండలం ప్రెస్‌క్లబ్ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. శుక్రవారం మండలంలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సమావేశం నిర్వహించి ప్రెస్‌క్లబ్ కమిటీని ఎన్నుకున్నారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా మణి(ఆంధ్రజ్యోతి) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా హేమ కుమార్(రాజ్ న్యూస్) కార్యదర్శిగా ఆర్‌వి రమణ(స్టార్ 9టీవీ), ఉప కార్యదర్శిగా (సాక్షి) కిరణ్, కోశాధికారిగా శేఖర్ ఎగ్జిక్యూటివ్ నెంబర్స్ డిఆర్ లక్ష్మీపతి, గురునాథ్, కుమార్ రవీంద్ర, వాసుదేవా చారి లు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

హౌసింగ్ ఏఈగా శ్రీధర్ బాధ్యతలు



హౌసింగ్ ఏఈ శ్రీధర్

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: మండల హౌసింగ్ ఏఈగా శ్రీధర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఎస్ఆర్ పురం మండలం నుంచి ఆయన బదిలీపై వచ్చారు. ప్రభుత్వ లక్ష్యాల మేరకు అందరి సమన్వయంతో అభివృద్ధికి తోడ్పడతానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత



నిత్యావసరాలను అందిస్తున్న ఎమ్మెల్యే పీఆర్‌వోలు

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: అగ్ని ప్రమాదంలో ఇల్లు కోల్పోయిన బాధిత కుటుంబానికి తన వంతు సాయంగా ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ఆర్థిక సాయం పంపించారు. వివరాలు.. మండలంలోని వేపంజేరి పంచాయతీ నెల్లెపల్లె గ్రామ సమీపంలో గుట్ట ఎస్‌సి కాలనీకి చెందిన జానకి లక్ష్మీదేవికి చెందిన ఇల్లు గురువారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ థామస్ శుక్రవారం బాధిత కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సాయం, నిత్యావసరాలను వ్యక్తి గత సహాయకుల ద్వారా పంపించారు. వారికి అండగా ఉంటామని ఫోన్ ద్వారా మాట్లాడి భరోసా ఇచ్చారు.

క్రీడా పోటీలలో విద్యార్థుల ప్రతిభ



విజేతలుగా నిలిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-సోమల: సోమల జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన మండల స్థాయి కోకో వాలీబాల్ పోటీలలో సూరయ్యగారిపల్లె ఉన్నత పాఠశాల విద్యార్థులు బాలురు, బాలికల విభాగంలో ప్రతిభ కనబరిచి విజేతలు, రన్నర్‌గా నిలిచారు. కోకో విభాగంలో నిర్వహించిన అన్ని పోటీలలో ప్రతిభ కనబరిచి మండల స్థాయి విజేతలుగా అటు బాలికలు ఇటు బాలురు నిలిచారు. బాలుర వాలీబాల్ పోటీలలో రన్నర్స్‌గా నిలిచారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో విజేతలను హెచ్‌ఎం నిరంజన్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు శివకుమార్ అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-శాంతిపురం: ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పలు అభివృద్ధి పనులను శుక్రవారం ఎంపీడీవో పరిశీలించారు. మండలంలోని నల్లరాళ్లపల్లిలో ఆయన పర్యటించారు. ప్రతి పంచాయతీకి 30ఫారం ఫాండ్‌ల చొప్పున మంజూరుకు చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి అక్కడి స్థానికులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం మంజూరు చేస్తున్న పనులను వారికి వివరించారు. కార్యక్రమంలో ఏపీవో హరినాథ్, హౌసింగ్ ఇన్‌ఛార్జ్ పురుషోత్తం, హౌసింగ్ ఇన్స్పెక్టర్, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

ప్రజాశక్తి-విజయపురం: మండలంలో ఎం.అంగరంలో సర్పంచ్ సుధాకర్ గ్రామంలో పారిశుద్ధ్య పనులు పర్యవేక్షించారు. శుక్రవారం ఓవర్ ట్యాంక్ బ్లీచింగ్‌తో శుభ్రం చేయించారు. రోడ్డుకు ఇరు వైపుల పిచ్చి మొక్కలను తొలగించారు. పేడ దిబ్బలను జేసీబీ ద్వారా తీయించారు. నిల్వ ఉన్న మురికి నీటిని తొలగించి, ఆయిల్ బాల్స్ వేశారు. రోడ్డు ఇరు పక్కల బ్లీచింగ్ చేయించి, పొడి, తడి చెత్తలను వేరు చేసి గ్రీన్ అంబాసిడర్ ద్వారా అందించాలని స్థానిక ప్రజలకు సూచించారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌లను వెంటనే విధుల్లోకి తీసుకోండి

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలో పని చేసిన 11మంది ఫీల్డ్ అసిస్టెంట్‌లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని శుక్రవారం ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఎంపిడీవోకు వినతి పత్రం అందజేశారు. ఎన్నికల అనంతరం అన్యాయంగా విధులకు హాజరుకావొద్దంటూ తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారని ఎంపిడీవో ఎదుట వాపోయారు. పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: అనుమతి లేని వాహనాలను సిఐ ముత్తయ్య ఎస్ఐ విశ్వనాథ నాయుడును మండలంలోని బస్టాండ్ ఆవరణలో శుక్రవారం తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా అనుమతులు లేని ద్విచక్ర వాహనాలను, ఆటో వాళ్లను ప్రత్యేకంగా పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. వాహనాలకు అవసరమైన పేపర్సు, వాహనాల లైసెన్సులు సక్రమంగా ఉన్నాయా లేదని పరిశీలించి లేని వాహనాలకు పెనాల్టీ విధించారు. నిబంధనలు పాటించని ఆటోలకు జరిమానా విధించారు.

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



గురుపూజోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం అని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి అన్నారు. మండల కేంద్రం లోని ఓ కళ్యాణ మండపంలో గురుపూజోత్సవ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటా నికి నివాళులర్పించారు. అనంతరం సమాజంలో గురువుల పాత్ర, బాధ్యతలను వివరించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులను ఎమ్మెల్యే ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో వేణుగోపాల రెడ్డి, టీడీపీ నాయకులు కిషోర్ గౌడ్, సుబ్రమణ్యం శెట్టి, భువన చంద్ర గౌడ్, పళని తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణలో అధికారుల నిర్లక్ష్యం

- కాపాడాలని అధికారులను డిమాండ్ చేసిన సీపీఐఎంఎల్ నాయకులు సుబ్రమణ్యం



విలేకరులతో మాట్లాడుతున్న సుబ్రమణ్యం

ప్రజాశక్తి-కార్వేటినగరం: వన్యప్రాణుల సంరక్షణలో అటవీశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి సుబ్రమణ్యం ఆరోపించారు. శుక్రవారం అటవీశాఖ కార్యాలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేటగాళ్లు వన్యప్రాణులను యథేచ్ఛగా వేటాడుతున్నా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని తెలిపారు. నిన్నటి దినం నగరవనం సమీపంలోని కుప్పానిగుంట వద్ద నాలుగు అడవి పందులు ప్రమాదశాత్తు రోడ్డు పక్కన పడి ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారన్నారు. అయితే ఈ విషయమై కార్వేటినగరం ఫారెస్టు అధికారులను వివరణ కోరగా పొంతలేని సమాధానం చెబుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. నాలుగు పందులు ఉన్నట్లు సమాచారం అందినా ఒక్కటి మాత్రమే నని, వాటి కూడా పోస్టుమార్టం నిర్వహించి పూడ్చిపెట్టినట్లు నిర్లక్ష్య సమాధానం మిస్తున్నారని ఆరోపించారు. ఈ సంఘటనపై ఉన్నత అధికారులు పూర్తి స్థాయి విచారణ చేపట్టి నిజనిజాలు తేల్చాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎక్సోటిక్ పార్క్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

- మినీ 'జూ'లా నిర్వాహకుల ఏర్పాటు
- ఉపాధి అవకాశాలపై ఎమ్మెల్యే హర్షం



పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాని



పార్కులో ఆకట్టుకున్న వివిధ రకాల పక్షులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధి లోని తిరుమల నగర్ గ్రామ పంచాయతీ కరకంబాడి ప్రధాన మార్గంలో ఉన్న రామచంద్ర నగర్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఏ టు జెడ్ ఎక్సోటిక్ పార్క్, రెస్టారెంట్‌ను శుక్రవారం చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నాని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ మంగళం పరిధిలో ఇలా ఉపాధి అవకాశాలు కల్పించే ఎక్సోటిక్ పార్క్ ఏర్పాటు చేయడం అభినందనీయమని, ఈ ఏర్పాటు ద్వారా స్థానికంగా ఉన్న 35 మందికి ఉపాధి అవకాశాలు పొందారన్నారు. ఏటు జెడ్ ఎక్సోటిక్ పార్కు నిర్వాహకులు హర్షవర్ధన్ మాట్లాడుతూ ఇలాంటి పార్కు ఏర్పాటు చేసి ప్రజలకు ఆహ్లాదాన్ని అందించాలని ఒక డ్రీమ్ ప్రాజెక్టుగా దీన్ని ఎంచుకున్నానన్నారు. ఈ ఎక్సోటిక్ పార్క్ లో చిన్న పిల్లలు ఆట పాటలు ఆడుకునే విధంగా ఏర్పాటు చేశామని, ప్రత్యేకంగా విదేశాల నుండి తెచ్చిన పక్షులు, పాములు, వివిధ రకాల జంతువులు ఆకర్షణగా నిలుస్తాయన్నారు. ఎప్పుడూ చూడని విదేశీ జాతులకు చెందిన కోళ్లు, పిట్టలు, మక్కావ్, ముంగిస, విదేశీ జాతికి చెందిన కుందేళ్ళు, వివిధ రకాలైన చేపలు, పాములు, దేశీ జాతికి చెందిన గుర్రం, ఒంటె, వివిధ జాతులకు చెందిన కుక్కలు సందర్శకులకు కనువిందు చేయనున్నాయన్నారు. ఏ టు జెడ్ ఎక్సోటిక్ పార్క్ అందించే ఆహ్లాదాన్ని సందర్శించి అనుభూతిని పొందాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు డాలర్స్ దివాకర్ రెడ్డి, సునీల్, దినేష్, స్థానిక టిడిపి నాయకులు ఈశ్వరయ్య, గోపీనాథ్, మహేశ్వర్, చెన్నారాయుడు, రాధాకృష్ణ, జ్యోతి కృష్ణ, జనార్దన్, చిన్నరెడ్డిబాబు, చలపతి, ప్రభాకర్, రామకృష్ణ పాల్గొన్నారు.

సొసైటీల కంప్యూటరీకరణ



మాట్లాడుతున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధికారులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్: రాష్ట్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో కంప్యూటరీకరణ చేస్తున్నామని డివిజనల్ సహకార శాఖ అధికారి రవి రాజశేఖర్ పేర్కొన్నారు. గూడూరు 24వ నెంబరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయ ఆవరణలో డివిజనల్ సహకార శాఖ అధికారి రవి రాజశేఖర్ అధ్యక్షతన మహాజన సభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సహకార సంఘాలను కంప్యూటరీకరణ చేస్తున్నారని పేర్కొన్నారు. ఇందులో భాగంగా సంఘసభ్యులు కేవైసి డిటైల్స్‌ను సొసైటీకి అందించాలన్నారు. ఇక నుండి ఆన్‌లైను విధానంలోనే సహకార సంఘ కార్యకలాపాలు నిర్వహిస్తారని తెలిపారు. ప్రతి రైతుకూ ఆన్‌లైను ద్వారా అన్ని సేవలు అందించేం దుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ విద్యా సాగర్, పర్సన్ ఇన్‌ఛార్జి శ్యాం కుమార్, గూడూరు డిసిసిబి మేనేజర్ సత్యవతి, గూడూరు సిఇవో నారాయణ, తిప్ప గుంట పాలెం సిఇవో రామయ్య, గూడూరు పట్టణ, మండల టిడిపి అధ్యక్షులు తెలుగు శ్రీనివాసులు, వెంకటేశ్వరరాజు, గూడూరు నం 24 పిఎసిఎస్ సిబ్బంది పాల్గొన్నారు. **కోట:** కోట మండలం తిన్నెలపూడి పిఎసిఎస్‌లో పర్సన్ ఇన్‌ఛార్జ్ పి మహేష్ సింగ్, సంఘ సీఈఓ కె శ్రీనివాసులు అధ్యక్షతన శుక్రవారం మహాజన సభ నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘ సభ్యుల కేవైసి, కేవైసి లేని సభ్యుల సభ్యత్వం రద్దు, పిఎసిఎస్ కంప్యూటరీ కరణ, తదితర అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో మాజీ ఉప మండల అధ్యక్షులు గుర్రం అశోక్ కుమార్, సొసైటీ మాజీ డైరెక్టర్ కేతంరెడ్డి సురేంద్ర రెడ్డి, సొసైటీ మాజీ డైరెక్టర్ కర్లపూడి శ్యామ్ సుందర్, డీసీసీబీ కోట మేనేజర్ సాయి కేశవరామ్, డిసిసిబి కోట అసిస్టెంట్ మేనేజర్, సూపరవైజర్ వెంకటేశ్వర్లు, సొసైటీ మాజీ సీఈఓ వెంకట నరసరాజు, ఊనుగుంటపాలెం సీఈఓ, కొత్తపాలెం సీఈఓ, సిద్దవరం సీఈఓ, చిట్టేడు సీఈఓ, తదితరులు, సంఘ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణపై సమావేశం



మాట్లాడుతున్న ఆరోగ్యాధికారులు

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: ఈ నెల17వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహణపై మండల అధికారులకు ఎంపిడివో అధ్యక్షతన శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ దివాకర్, ఆరోగ్య అధికారి డిఎన్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి సంవత్సరంలో రెండుసార్లు నిర్వహించే నులిపురుగుల నివారణ కార్యక్రమం రెండవ విడత ఈ నెల 17వ తేదీ నిర్వహిస్తామని ఈ సందర్భంగా ఒక సంవత్సరం బిడ్డ నుండి 19 సంవత్సరాల పిల్లలందరికీ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ, ఇంటి వద్ద వున్న పిల్లలందరికీ ఆల్బెండజోల్ టాబ్లెట్ మింగించాలని సూచించారు. ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, పాఠశాల ఉపాధ్యాయ , ప్రధానోపాధ్యాయులు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్ పి లు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయ వంతం చేయాలని సూచించారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో చేతులు, శరీర శుభ్రత, మరుగుదొడ్ల వినియోగం, రక్తహీనత, నులి పురుగుల నివారణపై వివరించాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీవో త్రివిక్రమ రావు, వైద్యాధికారి డాక్టర్ దివాకర్, ఆరోగ్య అధికారి డిఎన్ వెంకటేశులు, అంగన్‌వాడీ సూపరువైజర్ శిల్ప, విద్యాశాఖ సిబ్బంది, తహశీల్దారు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్యాన్సర్ నిర్ధారణ వైద్య పరీక్షలు



క్యాన్సర్ నిర్ధారణ వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి -దొరవారిసత్రం : స్విమ్స్, శ్రీ బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యంలో దొరవారిసత్రం పిహెచ్ సి పరిధిలోని ఉచ్చూరు విలేజ్ హెల్త్ సెంటర్ లో క్యాన్సర్ నిర్ధారణ వైద్య పరీక్షలను శుక్రవారం ఉచితంగా నిర్వహించారు. ఈ క్యాన్సర్ నిర్ధారణ వైద్య పరీక్షలు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో తిరుపతి జిల్లాలో పింక్ బస్సు ద్వారా మొబైల్ క్యాన్సర్ నిర్ధారణ వైద్య పరీక్షలు వేగంగా జరుగుతున్నాయని ఇందులో భాగంగా ప్రస్తుతం దొరవారిసత్రం పిహెచ్‌సి పరిధిలో నిర్వహిస్తున్నామన్నారు. మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో దొరవారిసత్రం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ వి చైతన్య, స్విమ్స్ శ్రీ బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి పద్మావతి, సర్పంచ్ వి పద్మమ్మ, పంచాయతీ కార్యదర్శి షేక్ ఖాదర్ మస్తాన్, స్థానిక నాయకుడు పి శ్రీనివాసులు, నర్సింగ్ సిబ్బంది, స్థానిక వైద్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పి, ఏఎన్ఎం, మల్లేశ్వరి ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

చంద్రబాబు సేవలు వెలకట్టలేనివి

టిడిపి బీసీ పాలఏకరి చిత్తూరు అధ్యక్షురాలు మల్లూరు దేవి



ప్రజాశక్తి-యర్రావారిపాలెం: విజయవాడ వరద బాధిత ప్రాంతాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు అందిస్తున్న సహాయక చర్యలు వెలకట్టలేనివని టిడిపి బిసి పాలేకరి చిత్తూరు పార్లమెంటు అధ్యక్షురాలు మల్లూరు దేవి అన్నారు. యర్రావారిపాలెం మండలంలో శుక్రవారం ఆమె విలేకరులతో ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడని ఆయన అనుభవమే రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి వైపు నడిపిస్తోందని కొనియాడారు. దేశం మొత్తం చంద్రబాబును ఆదర్శంగా తీసుకొని రాష్ట్రాల అభివృద్ధి కోసం పరితపిస్తున్నారని పేర్కొన్నారు. చంద్రబాబు చేస్తున్న అభివృద్ధిని చూడలేక ప్రతిపక్షాలు విష ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. చంద్రబాబును చూసి వరదల సహాయార్థం స్వచ్ఛందం గా చాలామంది ఆర్థిక సహాయం అందిస్తున్నారని, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తన వంతు బాధ్యతగా విజయవాడ వరద ప్రాంతాల్లో పర్యటించి సేవా కార్యక్ర మాలు చేశారన్నారు. టిడిపి కార్యకర్తలు, నాయకులు ఎమ్మెల్యే పులివర్తి నాని ఆదేశాల మేరకు తను వంతు బాధ్యతగా స్వచ్ఛందంగా ఆర్థిక సహాయం చేశారని పేర్కొన్నారు. భవిష్యత్తులో పేద బడుగు బలహీన వర్గాలకు సేవ చేయడానికి నేను సైతం సిద్ధంగా ఉంటానని దేవి ఆశాభావం వ్యక్తం చేశారు.

రూ. అరకోటి విలువైన ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచల అడవుల నుండి ఎర్రచందనం స్మగ్లింగ్ అరికట్టడానికి ప్రత్యేక కార్యచరణతో సిబ్బందికి ఇచ్చిన సూచనలు ఫలితాలను ఇస్తున్నట్లు టాస్క్ ఫోర్స్ ఇన్చార్జి సుబ్బరాయుడు తెలిపారు. శుక్రవారం తిరుపతి నగర పరిధిలోని కపిలతీర్థం వద్దగల టాస్క్ ఫోర్స్ కార్యాలయలో నంద్యాల జిల్లా చాబోలు మార్గం దగ్గర కర్నూలు నుండి కడప వైపు వచ్చిపోయే వాహనాలలో బయటపడ్డ రూ.62.5 లక్షల విలువ గల ఎర్రచందనం దుంగలు, రవాణా చేసిన మినీ లారీని టాస్క్ ఫోర్స్ ఇన్చార్జి, తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ తో కలిసి పరిశీలించారు. టాస్క్ ఫోర్స్ కడప ఆర్ ఐ చిరంజీవులు, ఆర్ఎస్ఐ నరేష్ వారి సిబ్బందితో గురువారం నంద్యాల జిల్లా చాబోలు మార్గం కర్నూలు నుండి కడప వైపు వచ్చే వాహనాలను తనిఖీ చేపట్టారన్నారు. కర్నూలు వైపు నుండి ఒక మినీ లారీ టాస్క్ ఫోర్స్ తనిఖీలను గమనించి పారిపోయే ప్రయత్నం చేయగా అడ్డుకొని నలుగురిని అదుపులోకి తీసుకున్నమన్నారు. వీరు ప్రకాశం, హైదరాబాద్, రాజస్థాన్ ప్రాంతాలకు చెందినవారుగా గుర్తించామన్నారు. మినీ లారీలో పరిశీలించగా 54 ఎర్రచందనం దుంగలు ఉన్నాయన్నారు. ఈ ఘటనపై టాస్క్ ఫోర్స్ ఎస్సై రఫీ కేసు దర్యాప్తు చేస్తున్నారన్నారు.

వరిలో మేలైన యాజమాన్యంతో అధిక దిగుబడి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్ : రాబోవు రబీలో వరిలో సరైన రకాల ఎంపిక, సక్రమ ఎరువుల యాజమాన్యంతో అధిక దిగులు పొందవచ్చునని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఏ డి ఏ భాస్కరయ్య తెలిపారు. వడమాలపేట మండలం టి.సి అగ్రహారంలో 'ఆత్మ' కింద రైతులకు శిక్షణ ఇచ్చారు. రబీలో రైతుల అధికంగా సాగు చేసే కె. ఎన్. యం.1638 రకానికి బదులు కె.ఎన్. యం. 733., ఆర్. ఎన్. ఆర్. 15048 కి బదులు ఎన్. ఎల్. ఆర్. 34449 రకాలను సాగు చేసుకోవాలని సూచించారు. వరిలో పైరుపై పైపాటుగా కాంప్లెక్స్ ఎరువులను వాడరాదని తెలిపారు. దీనికి బదులు నాటిన తర్వాత మొదటి దఫా పైరుపై వేసే ఎరువులకు బదులు ఎకరానికి అర్ధ లీటరు నానో యురియా, అర్ధ లేటరు నానో డిఏపి కలిపి వాడకంతో మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. వరిలో కలుపు నివారణ, చీడల నివారణ గురించి ఏఓ వేణుగోపాలరావు వివరించారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు ఏడిఏ రమేష్, గ్రామ వ్యవసాయ సహాయకులు యమునా, మోహన్, దివ్య రైతులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు ఆస్తుల జోలికి రావొద్దు

- యూత్ కాంగ్రెస్



ప్రజాశక్తి-పుంగనూరు: కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డు ఆస్తులు జోలికొస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అయూబ్ ఖాన్ అన్నారు. స్థానిక ఇందిరా సర్కిల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వక్ఫ్ బోర్డ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్ఫ్ బోర్డును 1954లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీ హక్కులను కాపాడేందుకు జవహర్ లాల్ నెహ్రూ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో వక్ఫ్ బోర్డును నూతనంగా ఏర్పాటు చేశారు అని చెప్పారు. ఈ బోర్డును మరింత బలపరుస్తూ పీవీ నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో మరికొన్ని చట్టాలను మైనార్టీల కోసం తేవడం జరిగిందన్నారు. దీన్ని ప్రస్తుత కేంద్ర ప్రభుత్వంరద్దు పరచాలని ఉన్న ఆలోచనలు వెంటనే విరమించు కోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాయల్, అల్తాఫ్, ఇమ్రాన్, ముబారక్, ఫయాజ్, ఫిరోజ్, సుహేల్, సాదిక్ తదితరాలు పాల్గొన్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి



పెద్దపంజాణి మండలంలో

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: తల్లిబిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ పౌష్టికాహారం తీసుకోవాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ రమాదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని గంగినాయనపల్లి అంగన్వాడీ కేంద్రం పరిధిలో ర్యాలీ చేపట్టి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ సుగుణ, సహాయకురాలు సరిత, సాయిదివ్య, ఆశ వర్కర్ రెడ్డమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెద్దపంజాణి: బాల బాలికల్లో జీవ రసాయన ప్రతి చర్యల్లో సూక్ష్మ పోషకాలు వారు ఎదుగుదలకు కీలకపాత్ర పోషిస్తాయి అని పలమనేరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఇందిరా ప్రియదర్శిని అన్నారు. శుక్రవారం మండలంలోని నేలపల్లి, రాయలపేట అంగన్వాడి సెంటర్లు పౌష్టికాహార మాస ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

సీతారాం ఏచూరికి అశ్రు నివాళి

ప్రజాశక్తి -నాయుడుపేట: నాయుడుపేట పెదనపర్తి సుందర్ రాంరెడ్డి భవన్ సిఐటియు కార్యాలయంలో సీతారాం ఏచూరికి అశ్రు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయ కులు శివకవి ముకుంద, యుటిఎఫ్ సీనియర్ నాయకు లు రాజశేఖర్ రెడ్డి మాట్లా డుతూ మార్క్సిజాన్ని భారతీయ పరిస్థితులకు వర్తింపజేసి విప్లవమే ఊపిరిగా సాగిన సీతారాం ఏచూరి మరణం దేశానికి, కార్మిక వర్గానికి తీరని లోటన్నారు. ఆయనకు జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె విజయమ్మ, సిఐటియు సభ్యులు వి వీరా స్వామి, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు సునీల్, రజక సంఘం నాయకులు పుట్టయ్య, యుటిఎఫ్ నాయకులు సుబ్బారావు పాల్గొన్నారు.

రుయా అభివృద్ధి కమిటీ సభ్యులుగా లక్ష్మీపతి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతి రుయా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులుగా బండ్ల లక్ష్మీపతి నియమిస్తూ ఆస్పత్రి సూపరిం టెండెంట్ డాక్టర్ రవి ప్రభు ఉత్తర్వులు జారీ చేశారు. ఆసుపత్రి ప్రిన్స్‌పల్, కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయన నియామకం చేపట్టామని, ఆస్పత్రి అభివృద్ధికి ఆయన కృషి చేయాలని సూచించారు.

సబ్సిడీ ఉలవలు పంపిణీ

ప్రజాశక్తి -యర్రావారిపాలెం: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న 80 శాతం సబ్సిడీ ఉలవల విత్తనాలను చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని బోడ్డెవాండ్లపల్లిలో రైతులకు శుక్రవారం అందించారు. రైతులకు అవసరమైన సబ్సిడీ విత్తనాలు అందిస్తున్నామన్నారు. ఈ సబ్సిడీ విత్తనాలు ప్రతి రైతుకు అందేలా చూడాలని పక్కదారి పడితే చర్యలు తీసుకుంటామని అధికారులను హెచ్చరించారు.

జియో మ్యాపింగ్‌పై శిక్షణ

ప్రజాశక్తి -నాయుడుపేట: స్కూల్ కాంప్లెక్స్ అడ్జెస్ట్‌మెంటులో భాగంగా శుక్రవారం నాయుడు పేట మండలంలో ఎంఈఓల సమక్షంలో నాయుడుపేట మున్సి పాల్టీ పరిధిలోని జెడ్పి బాలుర ఉన్నత పాఠశాలల సిబ్బందికి స్కూల్స్ మ్యాపింగ్‌పై శిక్షణ ఇచ్చారు. స్కూళ్లకు మ్యాపింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి తిరుపతి డీఈవో శేఖర్, అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ శివ శంకరయ్య సందర్శించారు. వారి సూచనల మేరకు వారి వారి మండల పరిధిలోని కాంప్లెక్స్‌లకు స్కూల్స్‌ని మ్యాపింగ్ చేశారు. ఈ సందర్భంగా ఎంఐఎస్‌లకు జియో మ్యాపింగ్ సంబంధించి శిక్షణ తరగతుల నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట మండలం ఒకటవ ఎంఈఓ శాంతి, ద్వితీయ ఎంఈఓ బాణాల మునిరత్నం పాల్గొన్నారు.

'మురుగు కాలువల్లో చెత్త తొలగించాలి'

ప్రజాశక్తి -తిరుపతి టౌన్ : ప్రధాన మురుగు కాల్వల్లో చెత్త తొలగింపు పనులు రెండు మూడు రోజుల్లోపు త్వరగా పూర్తి చేయాలని కమిషనర్ ఎన్.మౌర్య అన్నారు. శుక్రవారం పారిశుధ్య పనులను పరిశీలించారు. నగరంలో గార్బేజ్ వల్నరబుల్ పాయింట్స్ (జివిపి) లో చెత్త లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని హెల్త్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మున్సిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకటరామిరెడ్డి ఉన్నారు.

'హిందీ నేర్చుకుంటే ఉపాధి '

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : హిందీ భాష నేర్చుకోవడం వల్ల ఉపాధి అవకాశం ఎక్కువగా వుంటాయని గొల్లపల్లి జిల్లా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భారతి తెలిపారు. పుత్తూరు రూరల్ మండలం గొల్లపల్లి ఉన్నత పాఠశాలలో జాతీయ భాషా హిందీ దినోత్సవాన్ని ఆ పాఠశాల ప్రధానోపాధ్యయురాలు అధ్యక్షతన హిందీ ఉపాధ్యాయులు ఎన్ శ్రీరాములు, జి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నాట్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. వ్యాస రచన, వక్తృత్వ, చిత్ర లేఖనం, తదితర పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు పాఠశాలలకు సెలవు

ప్రజాశక్తి - తిరుపతి: తిరుపతి జిల్లాలోని అన్ని పాఠశాలలకు శనివారం సెలవని జిల్లా విద్యాశాఖ అధి కారి శేఖర్ తెలిపారు. సెప్టెంబర్ 2న అన్ని పాఠ శాలలకు సెలవు ఇచ్చామని చెప్పారు. ఈ నేపథ్యంలో రెండో శనివారం (నేడు) పాఠశాలలు పని చేయాల్సి ఉందని, కానీ దీనికి బదులుగా నవంబర్ 9వ తేదీ వర్కింగ్ డేగా నిర్ణయించినట్లు ఓ ప్రకటనలో పేర్కొ న్నారు. దీంతో శనివారం అన్ని విద్యా సంస్థలకు సెల వు ఇస్తున్నామని తెలిపారు. ఈ విషయాన్ని విద్యాశాఖ అధికారులు, సిబ్బంది గుర్తించాలని పేర్కొన్నారు.

గుండెపోటుతో యువకుడు మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ ఆందోళన



బస్టాండ్ వద్ద ఆందోళన చేస్తున్న మృతుని కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి-వి కోట: పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో కర్ణాటక రాష్ట్రం వెంగసంద్రాకు చెందిన కార్తిక్ (28) అనే యువకుడు గుండెపోటుతో మృతి చెందాడు. బాధితుల కథనం మేరకు వివరాలు.. కర్ణాటక రాష్ట్రం వెంగసందరాకు చెందిన కార్తీక్‌కు రామకుప్ప మండలం కొల్లుపల్లి చెందిన భవానితో ఐదు రోజుల క్రితం వివాహం జరిగింది. శుక్రవారం ఐదవరోజు అత్తారింటికి వచ్చిన యువకుడు అనారోగ్యంగా ఉందని మధ్యాహ్నం పట్టణంలోని ప్రైవేట్ క్లీనిక్‌కు చికిత్స నిమిత్తం భార్యతో కలిసి వచ్చాడు. అక్కడ చికిత్స పొందుతూ అతను హఠాత్తుగా మృత్యువాత పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ ఆందోళనకు దిగారు. ఆసుపత్రి ఎదుట కేజీఎఫ్ బస్టాండ్ ముందు జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన చేరుకుని విషయాన్ని ఆరాదీశారు. ఆ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదం.. ఇద్దరికి తీవ్ర గాయాలు



ప్రజాశక్తి-శాంతిపురం: రోడ్డు దాటుతున్న బైక్‌ను మరో బైక్ ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన శుక్రవారం మండల కేంద్రంలో వెలుగు చూసింది. స్థానికుల కథనం మేరకు.. శాంతిపురం మండలం మర్రిపల్లి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న సుబ్రహ్మణ్యం(46) స్థానిక శరవణ భవన్ హోటల్ వద్ద నుంచి తన బైక్‌పై రోడ్డు దాటుతుండగా రాళ్లబూదుగూరు వైపు నుండి కుప్పం వైపునకు గుడిపల్లి మండలం శెట్టిపల్లి గ్రామానికి చెందిన నరేష్(35) మితిమీరిన వేగంతో బైక్‌పై వచ్చి వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108ద్వారా కుప్పం పిఇఎస్ ఆసుపత్రికి తరలించారు. పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి బెంగళూరు మణిపాల్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు రాళ్లబూదుగూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్వియులో ముగిసిన పీజీ సెట్ సర్టిఫికెట్ల పరిశీలన

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 4వ తేదీ నుంచి 12వ తేదీ వరకు పిజి వివిధ కోర్సులలో చేరే విద్యార్థులకు ఒరిజినల్ సర్టిఫికెట్స్ పరిశీలన నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీ పీజీ సెట్ –2024 లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు సీట్లను ఆయా సంబంధిత విభాగాలలో కేటాయించేందుకు ప్రత్యక్షంగా ఒరిజినల్ సర్టిఫికెట్లను ఎస్వీయులోని డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో నిర్వహించామని డిఓఏ అధికారులు పేర్కొన్నారు. మొత్తం 1291 మంది విద్యార్థులకు 827 మంది విద్యార్థులు వివిధ విభాగాలలో అడ్మిషన్లు పొందారని, ఆర్ట్స్ విభాగంలో 68 శాతం సైన్స్‌లో 64 శాతం, కామర్స్ విభాగంలో 57 శాతం మంది విద్యార్థులు అడ్మిషన్స్ పొందారని తెలిపారు. గత సంవత్సరంతో పోల్చితే 20 శాతం ఎక్కువగా మొదటి దశలో అడ్మిషన్లు పెరిగాయని పేర్కొన్నారు.

ఆచార్య సుధాకరయ్యకు యుఎస్‌లో సభ్యత్వం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని గణితశాస్త్ర విభాగంలో ఆచార్యులుగా పనిచేస్తున్న సుధాకరయ్యను అమెరికా సంయుక్త రాష్ట్రాలకు చెందిన ఏడోఎక్సియా సంస్థ ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ లాంగ్వేజెస్ సొసైటీ పక్షాన కౌన్సిల్ మెంబరుగా ఎంపిక చేసింది. వారిని ఎస్వియూ ఉపకులపతి ఆచార్య అప్పారావు అభినందించారు. ఆచార్య సుధాకరయ్య ఒక సంవత్సరం పాటు ఆ సంస్థలో సభ్యులుగా వుంటారు.

ఓటీపీ చెబితేనే గ్యాస్ సిలిండర్

హెచ్‌పి గ్యాస్ సేల్స్ ఆఫీసర్ సురేష్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: గ్యాస్ వినియోగదారులు డెలివరీ బాయ్స్‌కు గ్యాస్ బుక్ చేయగానే వచ్చే నాలుగు అంకెల ఓటీపీ చెబితేనే గ్యాస్ సిలిండర్ ఇస్తారని హెచ్‌పి గ్యాస్ సేల్స్ ఆఫీసర్ సురేష్, ఎల్ పీజీ డిస్ట్రిబ్యూటర్ రవికుమార్ తెలిపారు. శుక్రవారం వారు రవి కుమార్ గ్యాస్ ఏజెన్సీ వద్ద బ్యానర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిజిస్టర్ మొబైల్ నుంచే గ్యాస్ బుక్ చేసుకో వాలన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యాలయం వద్ద గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారులకు దుస్తులు వితరణ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఈనెల 14 ,15 ,16 వ తేదీల్లో శ్రీకాకుళం జిల్లా పలాసలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ టెన్నికాయిట్ పోటీలలో పాల్గొననున్న క్రీడాకారులకు గూడూరులో టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షులు శ్యాం సుందరరావు (మయూరి శ్యామ్ యాదవ్) దాతృత్వంతో శుక్రవారం క్రీడా దుస్తులు అందించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే వారు జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు పైడి కోటేశ్వరరావు, సెక్రటరీ పి. భాస్కర్ కలిచేడు హెడ్మాస్టర్ కె హరి, ప్రసాద్ రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.